క్లుప్తంగా

గ్రామ సమైఖ్య భవనం ప్రారంభం


గ్రామ సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజేందర్‌నాయక్

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బేగంపేట్‌లో నూతనంగా నిర్మించిన గ్రామ సమాఖ్య భవనాన్ని సర్పంచ్ రాజేందర్‌నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమాఖ్య భవనం లేక డ్వాక్రా సంఘాల సభ్యులకు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం లేక సభ్యుల ఇళ్ల ముందు నిర్వహించుకోవాల్సి వచ్చేదని తెలిపారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కృషితో భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఏపీఎం సమత, సీనియర్ నాయకులు సాయిగౌడ్, సీసీ సంతోష, వార్డు సభ్యులు మల్లేశ్వరి, లావణ్య, అనిత, సరిత, వీఓఏ నగేష్, వీవో అధ్యక్షురాలు కృష్ణవేణి, సభ్యులు రిహానా, సరిత పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ బస్సుపై దాడి హేయమైన చర్య



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: ప్రజాదరణ చూసి ఓర్వలేకనే అస్సాంలోని సోనిత్‌పూర్ జిల్లాలో రాహుల్ గాంధీ బస్సుపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు అమిత్, యువరాజ్, గోపాల్ కుంచాల కిషన్, రతన్‌సింగ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ జోడో యాత్ర వాహనంపై బీజేపీ కార్యకర్తలు చేసిన దాడిని నిరసిస్తూ సంగారెడ్డిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథయాల సమస్త చైర్మన్ తోపాజి అనంతకృష్ణ, కాంగ్రెస్ పార్లమెంట్ ప్రెసిడెంట్ కూన సంతోష్, టౌన్ ప్రెసిడెంట్ జార్జ్ మాథ్యూస్, కౌన్సెలర్స్ నాగరాజు, నర్సింహులు, నాయకులు సునీల్, ప్రవీణ్, తాహెర్, కుతుబ్, శ్రీహరి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మనూరు మండలం పుల్‌కుర్తి గ్రామానికి చెందిన హిమందర్‌మోసీన్‌కు రూ.36వేలు, ఖేడ్ మండలం అబ్బెంద గ్రామానికి చెందిన నారాయణకు రూ.12వేలు మంజూరు అయ్యాయి. సోమవారం అందుకు సంబంధించిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఖేడ్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. అబ్బెంద సర్పంచ్ సుదర్శన్‌పాటిల్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం


రక్తదానం చేస్తున్న జర్నలిస్టులు

సంగారెడ్డి: సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు పాత్ర పోషించే జర్నలిస్టులు మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి రక్తం అవసరమని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు స్పందించిన సంగారెడ్డి జర్నలిస్టులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, బాధితుడి బంధువులు జర్నలిస్టులు డేవిడ్, మురళి, ప్రదీప్, రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

జిన్నారం(పటాన్‌చెరు): ఎఫ్‌సీఐ బియ్యం తరలిస్తున్న లారీని అడ్డుకొని దురుసుగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిన్నారం ఎస్‌ఐ విజయారావు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం గ్రామానికి చెందిన మంద శ్రీధర్, పుట్టి రమేష్ ఎఫ్‌సీఐ బియ్యంను తరలిస్తున్న ఓ లారీని అడ్డుకుని దురుసుగా వ్యవహరించారు. అంతేకాకుండా డబ్బులు డిమాండ్ చేశారు. లారీ ఓనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మది నిండా రామనామస్మరణ

అయోధ్యలో బలరాముడి విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పలుచోట్ల ర్యాలీలు, అన్నదానాలు చేపట్టారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు


కంది: ఇంద్రకరణ్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


రామచంద్రాపురం: ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్ప


హత్నూర: హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఝరాసంగం: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు


ప్రసాద వితరణ చేస్తున్న మోచి సంగార్ సంఘం నాయకులు


జిన్నారం: స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


నారాయణఖేడ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


సంగారెడ్డి టౌన్: ఇంటిముందు ముగ్గు వేస్తున్న యువతి


జహీరాబాద్ టౌన్: శ్రీసాయిరాంనగర్ కాలనీలో సామూహిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


సదాశివపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు


కల్హేర్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- గ్రామీణ జాతరలు తెలంగాణ సంస్కృతిక ప్రతీకలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఐనోలు గ్రామంలో నిర్వహిస్తున్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్నిగ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేవిధంగా మరింత కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి, రాంరెడ్డిబావి, కానుకుంట గ్రామాల్లో రూ.2కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం గుమ్మడిదలలోని శ్రీరామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించండి

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాటి గ్రామంలో నమోదు చేసిన బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రజనీకాంత్ డిమాండ్ చేస్తూ వార్డుసభ్యులతో కలిసి ఉప తహసీల్దార్ కార్తీక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టగా ఎలాంటి స్థానిక సరియైన నివాస ఆధారాలు లేకుండానే స్థానికేతర బోగస్ ఓట్లను నమోదు చేసినట్లు ఆరోపించారు. గ్రామంలోని 288 పోలింగ్ స్టేషన్‌లో బోగస్ ఓట్లను సృష్టించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బోగస్ ఓట్లను తొలగించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మధుసూదన్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్‌యాదవ్, చంద్రశేఖర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

31న గద్దర్ విగ్రహావిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య, కొల్లూరి సత్తయ్య, నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో ఈ నెల 31న ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరణ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ప్రొఫెసర్ కంచ ఐలయ్య, గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్యతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. గద్దర్ గళం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతో పాటు అనేకమంది మేధావులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థుల

పటాన్‌చెరు టౌన్: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని మహేశ్వర మెడికల్ కళాశాల, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సన్నాహక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులు, పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ సంతోష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, నోడల్ ఆఫీసర్ నాగరత్నమ్మ, ప్రొఫెసర్స్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా విగ్రహ ఏర్పాటు

- సర్పంచ్ ఏకపక్ష నిర్ణయంతో విస్తుపోయిన గ్రామస్తులు
- దివంగత నేత వెంకటేశంగుప్తా విగ్రహం తొలగింపు
- సర్పంచ్ తీరుపై అధికారులకు ఫిర్యాదు


ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగిస్తున్న సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మాజీ ఎంపీపీ దివంగత పడకంటి వెంకటేశంగుప్తా విగ్రహ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. సర్పంచ్ ఏకపక్షంగా రాత్రికి రాత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పాటు ప్రజలకు, నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా మహానేత విగ్రహాన్ని ఏర్పాటు చేయటం సరైందికాదని ఆరోపిస్తూ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐ, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ రవికుమార్, ఎస్‌ఐ విజయరావు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు రాజిరెడ్డి, నరేష్, పుట్టి భాస్కర్, పల్నాటి భాస్కర్, ప్రదీప్‌గౌడ్, నరేందర్‌గౌడ్, మున్ని నర్సింలు మాట్లాడుతూ వెంకటేశంగుప్తా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన స్థలంలో తెలంగాణతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గతంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. సర్పంచ్ లావణ్య, ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించి ఎమ్మెల్యేతో పాటు ప్రజలకు, నాయకులకు, అధికారులకు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించినట్టుగా, ప్రొటోకాల్‌తో కూడిన శిలాఫలకాలను ఏర్పాటు చేశారని తెలిపారు. జిన్నారం మండలం అయ్యేందుకు అహర్నిశలు శ్రమించిన దివంగత నేత వెంకటేశంగుప్తా విగ్రహాన్ని అందరితో కలిసి ఆవిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విగ్రహాన్ని తొలగించిన అధికారులు

స్థానిక నాయకులు, ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయటంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంత్‌రెడ్డి మాట్లాడుతూ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. దీంతో విగ్రహాన్ని తొలగించామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలను తీసుకుంటామన్నారు.

సర్పంచ్ పదవికి రాజీనామా

జిన్నారం సర్పంచ్ లావణ్య తన పదవికి రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించిన రాజీనామా పత్రాన్ని సోమవారం సంగారెడ్డిలో డీఎల్‌పీఓకు అందజేశారు. ఈ ఆమె మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతోనే పదవికి రాజీనామా చేశానని తెలిపారు. తనపై ఎవరి ఒత్తిడి లేదన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని అధికారులను కోరారు.

బ్యాగులు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో నాయకులు రాకేష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్‌యాదవ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. పట్టణ శివారులో కరెంట్ తీగలు వేలాడుతూ ఒకదానిపై ఒకటి పడ్డాయి. దీంతో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పస్తాపూర్, జర్నలిస్టు కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జహీరాబాద్ రూరల్ ట్రాన్స్‌కో ఏఈ జగదీశ్వర్ స్పందించి సాయంత్రం వరకు కరెంట్ తీగలను సరిచేయించి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం



పండరిని శ్రీలత కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

జోగిపేట(అందోల్): ఈ నెల 10వ తేదీన జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన వ్యక్తి అదృశ్యం కేసును జోగిపేట పోలీసులు చేదించారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీలత భర్త పండరి ఇటీవల ఇంట్లో గొడవపడి వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీంతో ఆమె జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి పండరి ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉండడంతో ఆచూకీ లభించలేదు. ఆదివారం ఫోన్ ఆన్ చేయడంతో ఆ నంబర్‌తో ఆయన ఉన్న లోకేషన్‌ను గుర్తించిన పోలీసులు నర్సాపూర్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ ప్రాంతంలో ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఫిర్యాదుదారులను పిలిచి వారి కుటుంబ సభ్యులకు పండరిని అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీలత కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి


మంత్రి దామోదరను సన్మానిస్తున్న తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆయన నివాసంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ గ్రేటర్ కమ్యూనిటీలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.